క్లుప్తంగా

ఘనంగా కృష్ణమయ్య జయంతి



కృష్ణమయ్య విగ్రహం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

సింహాచలం: భాద్రపద చతుర్దశిని పురస్కరించుకుని సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో శనివారం శ్రీకాంత కృష్ణమాచార్య(కృష్ణమయ్య) జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో ఉన్న కృష్ణమయ్య విగ్రహం చెంతన దేవస్థానం వైదికులు విశేషంగా పూజలు నిర్వహించి హారతులు అందజేశారు. కృష్ణమయ్య వరాహ లక్ష్మీ నృసింహస్వామిపై రచించిన పలు సంకీర్తనలను ఈ సందర్భంగా వైదికులు విన్నపం చేశారు. కృష్ణమయ్య చరిత్ర, విశిష్టతను వివరించారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు, పారాయణదారులు ఈ కార్యక్రమం నిర్వహించారు.

అప్పన్నను దర్శించుకున్న కలెక్టర్ దంపతులు



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కి అప్పన్న చిత్రపటం అందజేస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని శనివారం కలెక్టర్ హరేందిరప్రసాద్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు చేసి వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి జ్ఞాపిక, ప్రసాదం, శేషవస్త్రం ఏఈఓ తిరుమలేశ్వరరావు అందజేశారు.

అప్పన్న అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం



ఈవో త్రినాథరావుకి చెక్కు అందజేస్తున్న దాత వాసిరెడ్డి వంశీ మోహిని

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం బొబ్బిలికి చెందిన వాసిరెడ్డి వంశీ మోహిని లక్ష రూపాయల విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. సంబంధిత చెక్కుని సింహగిరిపై దేవస్థానం ఈవో వి.త్రినాథరావుకి అందజేశారు. దేవస్థానం తరపున దాతకు అధికారులు స్వామి వారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.


శరన్నవరాత్రుల గోడపత్రిక ఆవిష్కరణ



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న నాయకులు, గ్రామ పెద్దలు

పరవాడ : స్థానిక బొంకుల దిబ్బ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దేవి నవరాత్రుల ఉత్సవాల గోడపత్రికను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు శనివారం ఆవిష్కరించారు. ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చుక్క రామునాయుడు, పెద్ద చెరువు రైతు సంఘ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, నాయకులు చల్లా కనకరావు, పైల హరీష్, పైల రాధాకృష్ణ, టీవీ అప్పారావు, చీపురుపల్లి శ్రీను, అజయ్, పైల అప్పారావు, లాలం గాటీలు, పైల పైడింనాయుడు, గండి గణేష్, వాసు, చిరికి కృష్ణ, వర్రి హరి పాల్గొన్నారు.

కలపాకలో వైద్య శిబిరం



వైద్య శిబిరంలో స్థానికులు, వైద్యులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం ఆధ్వర్యంలో కలపాక గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఇక్కడ ఏర్పాటు చేసిన శిబిరాన్ని సర్పంచ్ బొండా కనకరావు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం ఉచిత వైద్య సేవలు అందజేయడానికి ముందుకొచ్చిన సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. శిబిరంలో వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ బి.కె.మమత, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్ కల్యాణ్, సీఎస్సార్ ప్రతినిధులు కె.ప్రకాశరావు, శివప్రతాప్‌సింగ్ పాల్గొన్నారు.

రైతన్నా మేలుకో.. పాడి సంపద కాపాడుకో..



చిన్నయ్యపాలెంలో ఆవులకు గాలి కుంటువ్యాధి టీకాలు వేస్తున్న పశు సంవర్ధక శాఖ సిబ్బంది

- టీకాలతో పశువ్యాధులకు చెక్
- మండలంలో చురుగ్గా సాగుతున్న కార్యక్రమం
- ఇప్పటికే ముగిసిన థైలేరియా, లంపీ స్కిన్ వ్యాక్సినేషన్

సబ్బవరం: జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకునేందుకు రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను కూడా అభివృద్ధి చేసుకుంటున్నారు. మేలు జాతి పశువుల పెంపకం, మేలైన పసుగ్రాసం వినియోగించడం ద్వారా అధిక పాల దిగుబడి సాధిస్తున్నారు. అయితే పశువులకు సీజనల్‌గా సోకే గాలి కుంటు వ్యాధి, థైలేరియా, లంపీ స్కిన్(ముద్ద చర్మం) వంటి రుగ్మతలను నియంత్రించేందుకు పశు సంవర్ధక శాఖ ప్రతి గ్రామంలో ఉచిత టీకాల కార్యక్రమం చేపడుతోంది. ఇప్పటికే ఈ కార్యక్రమం పూర్తి కావచ్చింది. ప్రస్తుతం నెల రోజుల పాటు నిర్వహించనున్న టీకాల కార్యక్రమం మండలంలో చురుగ్గా సాగుతోంది.

సంకర జాతి పశువుల్లో అధిక తీవ్రత..

దేశవాళీ పశువుల కన్నా సంకరజాతి పశువుల్లో ఈ వ్యాధి తీవ్రత అధికంగా ఉంటుంది. దేశవాళీ పశువుల్లో ప్రాణ నష్టం అంతగా ఉండదు. మార్చి, ఏప్రిల్, ఆగస్టు మాసాల్లో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. ఇది పికోర్నా విరిడే కుటుంబానికి చెందిన అప్తోస్ వైరస్ వల్ల వస్తుంది. వ్యాధి సోకిన ఆవులు, గేదెల పాల ద్వారా లేగ దూడలకు వ్యాపిస్తుంది.

వ్యాధి లక్షణాలు..

జ్వరం 103–106 డిగ్రీల ఫారిన్ హీట్‌కు చేరుతుంది. పశువుల నోటిలో చిగుళ్లపై పొక్కులు ఏర్పడటం వల్ల అవి మేత, నీళ్లు తీసుకోలేక నీరసించిపోతాయి. నోరు, గిట్టల మధ్యలో బొబ్బలు ఏర్పడి 2–3 వారాల్లో అవి చితికి పుండ్లుగా మారతాయి. నోటి నుండి సొంగ కారుతుంది. పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది.

చికిత్స..

కాలిగిట్టల మధ్య పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడిగి ఈగలు వాలకుండా వేప నూనె రాయాలి. నోటిలోని పుండ్లకి గ్లిసరిన్, బోరిక్ పౌడర్ కలిపి పూయాలి. డాక్టర్‌ను సంప్రదించి అవసరమైన యాంటీబయోటిక్, నొప్పి నివారణ మందులు వాడాలి.

లంపీ స్కిన్ వ్యాధి..

మండలంలో 6,300 తెల్ల పశువులకు లంపీ స్కిన్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. జూలైలో మండలంలోని అన్ని గ్రామాల్లో ఉచిత లంపీ స్కిన్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. నాలుగు నెలల వయసు దాటిన ఆడ, మగ తెలుపు జాతి పశువులన్నిటికీ ఈ టీకాలు వేయించాలి. పాడి రైతులు వ్యాధి సోకిన పశువులను కడగరాదు. మిగిలిన పశువుల నుండి వ్యాధి సోకిన పశువులను వేరుగా ఉంచాలి. పశువులకు దద్దుర్లు రావడం, జ్వరం లక్షణాలు ఉంటాయి.

వ్యాధిని ఎలా నియంత్రించాలి?

వ్యాధి సోకిన వాటిని మిగిలిన పశువుల నుండి వేరు చేయాలి. పశువుల పాకలను క్రిమి సంహారక మందులు, వాషింగ్ సోడాతో కడగాలి. చనిపోయిన పశువులను సున్నపు గోతిలో పూడ్చాలి. వ్యాధి సోకిన పశువుల పాలను దూడలకు తాగించకూడదు. మార్చి–ఏప్రిల్, ఆగస్టు–సెప్టెంబర్ మాసాలకు ముందుగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.



గుల్లేపల్లిలో ఎంపీపీ బోకం సూర్యకుమారి పర్యవేక్షణలో టీకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జేడీ రామ్మోహనరావు

వ్యాధి కారకాలు, లక్షణాలు..

థైలేరియా వ్యాధి సంకరజాతి పశువులలో గోమారు, పిరుదులు కుట్టడం వల్ల వస్తుంది. విపరీతమైన జ్వరం, సరిగా మేత మేయకపోవడం, దవడల కింద గగ్గల వాపు, నీరసించిపోవడం, పాల దిగుబడి తగ్గిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.ఈ వ్యాధి వల్ల చూడి కట్టిన పశువుల్లో గర్భస్రావం జరగవచ్చు. ఈ వ్యాధి సోకిన పశువుల్లో 90 శాతం పశువులు వైద్యం అందించినప్పటికీ మృత్యువాత పడతాయి.

మండలంలో గ్రామ పంచాయతీల సంఖ్య-24

ఆవులు	10,473
గేదెలు	6,779
గొర్రెలు	3,890
మేకలు	5,905
ఫారం కోళ్లు	9,23,0260

థైలేరియా వ్యాధి నిరోధక టీకాలు..

మండలంలో 5,200 సంకరజాతి ఆవులకు థైలేరియా వ్యాధి నిరోధక టీకాలు వేశారు. మూడు నెలలు దాటిన ఆడ, మగ సంకరజాతి ఆవులకు ప్రభుత్వం జూన్,జూలై నెలల్లో రూ.850 విలువ చేసే టీకాలను ఉచితంగా ఇచ్చింది.

ఉచిత టీకాలతో వ్యాధులు దూరం..



పాడి పశువుల్లో సోకే గాలి కుంటు వ్యాధి, థైలేరియా, లంపీ స్కిన్ వంటి వాటిని పూర్తిగా నియంత్రించేందుకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఇప్పటికే థైలేయా, లంపీ స్కిన్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పూర్తయింది. నెల రోజుల పాటు నిర్వహించనున్న గాలి కుంటు వ్యాధి టీకాల కార్యక్రమం మాత్రం మండలంలో చురుగ్గా సాగుతోంది. పాడి పశువులకు ఈ టీకాలు వేయడం ద్వారా మిగిలిన పశువులకు వ్యాధి సోకకుండా నియంత్రించవచ్చు.

– డాక్టర్ చిట్టి నాయుడు, ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు, సబ్బవరం మండలం

పని గంటలు పెంచడం అన్యాయం



ఫార్మాసిటీలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

పరవాడ : పని గంటలు పెంచుతూ శాసన సభలో తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఫార్మాసిటీలో శనివారం నిరసన తెలిపారు. అనంతరం గనిశెట్టి మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే ధ్యేయమంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ ది డూయింగ్ బిజినెస్ పేరుతో పెట్టుబడిదారులు కార్మికుల శ్రమను దోచుకునేందుకు మరింత అనుకూలంగా కార్మిక చట్టాలను మార్చడం దుర దృష్టకరమన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పని దినాల చట్టాలను నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కి సవరించడం అన్యాయమన్నారు. తక్షణమే 13 పని గంటల పెంపు విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను నియంత్రించవచ్చు



రోగులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యాధికారి జయశ్రీ కరిష్మా

పరవాడ : క్యాన్సర్‌ను ప్రాథమిక స్థాయిలోనే గుర్తిస్తే మెరుగైన వైద్యంతో నియంత్రించవచ్చని పరవాడ ప్రభుత్వ వైద్యాధికారి జయశ్రీ కరిష్మా అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా పరవాడలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో మహిళలకు ఆమె వైద్య సేవలందించారు. అనంతరం మాట్లాడుతూ బ్రెస్ట్, గర్భాశయ, నోటి క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. గర్భిణులు ఎటువంటి ఆహారం తీసుకోవాలి, రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు అందజేశారు. అంగన్వాడీ కార్యకర్తలు పోషకాహార స్టాల్‌ను ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. శిబిరంలో డాక్టర్ శిరీష, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.ఎస్.ఎస్.సాయిరాం, పీహెచ్ఎన్ జానకీరామ్, సూపర్‌వైజర్లు ఎం.ఎస్.ప్రసాద్, హెచ్.వి.పి.వి.రత్నం, పీహెచ్‌సీ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందిస్తాం

సబ్బవరం : సహకార బ్యాంకుల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా సెంట్రల్ సహకార బ్యాంకు చైర్మన్ కోన తాతారావు అన్నారు. సబ్బవరంలోని శ్రీదుర్గమాంబ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో సంస్థ చైర్మన్ గండి దేముడు అధ్యక్షతన రైతులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాతారావు మాట్లాడుతూ సహకార సంస్థల్లో పారదర్శకంగా సేవలు అందించేందుకు కంప్యూటరీకరించామన్నారు. అనంతరం రైతులకు రుణాల చెక్కులు అందించారు. సెంట్రల్ బ్యాంకు సీఈవో డీవీఎస్ వర్మ, నోడల్ ఆఫీసర్ ఎంవీ కిశోర్, ఈవో గొంప రమణ, డైరెక్టర్లు పల్ల తాతారావు, బొబ్బరి కన్నారావు, నాయకులు బర్లికాన బాబురావు, గండి ముత్యాలనాయుడు, కోటాన అప్పారావు పాల్గొన్నారు.

డివైడర్ల ఏర్పాటుకు చర్యలు

సింహాచలం : గోశాల కూడలిలో డివైడర్లు ఏర్పాటు చేసేందుకు గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసులు శనివారం కొలతలు తీశారు. ఈ కూడలి వద్ద వాహనదారులు మితిమీరిన వేగంతో వెళ్తుండడంతో ఏ వాహనం ఎటు వెళ్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో రోడ్డు ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ కూడలిలో డివైడర్లు ఏర్పాటు చేసేందుకు ట్రాఫిక్ ఎస్ఐ సూరిబాబు ఆధ్వర్యంలో సిబ్బంది కొలతలు తీసుకున్నారు. సుమారు వంద మీటర్ల మేర డివైడర్లు అవసరమవుతాయని, జీవీఎంసీకి ప్రణాళిక పంపిస్తామని తెలిపారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో స్వామికి తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి సహస్రనామార్చన పూజ ఘనంగా జరిపారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. 1001 నామాలను పఠిస్తూ స్వామికి అర్చన చేశారు. విశేషంగా హారతి అందజేశారు. భక్తులకు శేషవస్త్రాలు, తులసి ప్రసాదం అందజేశారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణదారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

ఉత్సాహంగా ఫెన్సింగ్ సెలక్షన్ ట్రయల్స్



ఫెన్సింగ్ సెలక్షన్ ట్రయల్స్‌లో విద్యార్థులు, ఎంపీపీ నాగమణి, తదితరులు

పెందుర్తి : మండలంలోని వాలిమెరక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఆధ్వర్యంలో శనివారం ఫెన్సింగ్ సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించారు. విశాఖ, అనకాపల్లి, మన్యం జిల్లాల విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపీపీ మధుపాడ నాగమణి, సర్పంచ్ బొడ్డు చంద్రవాణి, ప్రధానోపాధ్యాయుడు అప్పలనాయుడు ప్రారంభించారు. స్కూల్ కమిటీ చైర్మన్ నక్క చిన్నారావు, పాఠశాల పీటీ రమేష్, కన్నారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

పెందుర్తి : మహాకవి గురుజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించారు. గురజాడ జీవితం, సాహిత్యం, సంఘ సంస్కరణలు, భాషా సంస్కరణలు అంశాలపై నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అలాగే పుత్తడిబొమ్మ – పూర్ణమ్మ స్కిట్ ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, జన విజ్ఞాన వేదిక సభ్యులు శ్రీకాంత్, జి.సి.శర్మ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సమస్యలు పరిష్కరించాలి

- కొనసాగిన దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్



సింహపురికాలనీలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దస్తావేజు లేఖర్లు



సబ్ రిజిస్ట్రార్ కీర్తిప్రియకు వినతిపత్రం అందజేస్తున్న దస్తావేజు లేఖర్లు

సింహాచలం : ఆన్‌లైన్ దస్తావేజు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం పిలుపు మేరకు రెండో రోజు శనివారం 98వ వార్డు సింహపురికాలనీలో ఉన్న గోపాలపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లంతా పెన్‌డౌన్ చేశారు. సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఆధార్ కార్డు ఓటీపీ, స్థానిక సంస్థల డేటాబేస్ ఆధారంగా ఇంటి రిజిస్ట్రేషన్లు, కార్డుప్రైమ్ సాఫ్ట్‌వేర్‌లోని సాంకేతిక లోపాల వల్ల ప్రజలు, డాక్యుమెంట్ రైటర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్డు ప్రైమ్ 2.0 ఓటీపీ విధానంలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. ఓటీపీ విధానం వల్ల దస్తావేజు లేఖర్లను ప్రజలు అనుమానించే పరిస్థితి నెలకొందని... ఎలాంటి పొరబాటు జరిగినా బుక్ చేసుకున్న స్లాట్ కూడా పోతోందని, దీన్ని రిజిస్ట్రార్ కూడా సరిదిద్దే అధికారం లేదన్నారు. ఓటీపీ విధానాన్ని రద్దు చేసి, సాఫ్ట్‌వేర్ లోపాలు సరిదిద్దాలని కోరారు. ఎస్.అర్జునరావు, భీశెట్టి అశోక్‌కుమార్, రవికుమార్, శ్రీనివాసరావు, ముఖలింగం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పెందుర్తి : పెందుర్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్ల నిరసన కార్యక్రమం రెండో రోజు శనివారం కొనసాగింది. కార్డ్ ప్రైమ్ 2.0లో ఉత్పన్నమయ్యే సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని పెందుర్తి దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం తరపున జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కీర్తి ప్రియకి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

అనంతరం పెందుర్తి దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.సురేష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా డి.సుబ్బరాజు, ఎ.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా సుంకర రమేష్, సహాయ కార్యదర్శిగా జి.శంకర్‌రావు, కోశాధికారిగా ఎమ్.గురునాథరావు ఎన్నికయ్యారు.

పచ్చదనంతోనే పరిసరాల పరిశుభ్రత

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డు సింహాచల్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్రా–స్వర్ణ ఆంధ్రా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాశాఖాధికారి సీహెచ్ రవీంద్రబాబు చెట్లని రక్షిద్దామని, పర్యావరణాన్ని కాపాడదామని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు గేదెల సన్యాసిరావు, ఉపాధ్యాయులు కె.రాజ్యలక్ష్మి, ఎంజేఎల్ బాయి, ఎస్.సలోమి తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై.. : సింహగిరిపై స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఉద్యోగులందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, సూపరింటెండెంట్లు సునీల్, జీవీవీఎస్‌కె ప్రసాద్, సత్య శ్రీనివాస్, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

బాలుర బేస్‌బాల్ పోటీలకు ఎంపికలు



బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

పరవాడ: అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు ఆదేశాల మేరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–17 బాలుర బేస్ బాల్ పోటీలకు ఎంపికలు పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో శనివారం నిర్వహించారు. బాలికల ఎంపికలను పరవాడ బాలికల జెడ్పీ పాఠశాలలో నిర్వహించారు. ఈ ఎంపిక కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన 160 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్–17 బేస్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.ఎం.నాయుడు తెలిపారు. ఈ పోటీలను సంస్కృతి గ్లోబల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి ప్రారంభించగా ఎం.వి.నాగేశ్వరరావు అబ్జర్వర్‌గా వ్యవహరించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ: మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు అన్నారు. శనివారం పెదముషిడివాడ జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాల గురించి తెలిపారు. బాలికల భద్రత, స్వీయ రక్షణ, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. ఎవరైన అనుచితంగా ప్రవర్తించినప్పుడు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పెందుర్తి : ట్రాఫిక్ నిబంధనలపై వేపగుంటలో హెచ్‌పీ గ్యాస్ డెలివరీ బాయ్స్‌కి వెస్ట్ ట్రాఫిక్ సర్కిల్ పోలీసులు శనివారం అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రద్దీ సమయాల్లో సిలిండర్లు తీసుకెళ్లే విధానానికి సాధ్యమైనంత మేర స్వస్తి పలకాలని, అధిక మొత్తంలో సిలిండర్లను ఒకేసారి వాహనంపై తీసుకెళ్తే చోటుచేసుకునే ప్రమాదాలపై సీఐ కె.సురేష్ అవగాహన కల్పించారు.

ఉచిత వైద్య శిబిరం నేడు

సింహాచలం : అడవివరంలోని ఎస్‌వీఎల్ఎన్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు అధ్యక్ష, కార్యదర్శులు టి.మురళి, బీఎస్.రావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరంలో కార్డియాలజీ, ఆర్థోపెడిక్, రేడియేషన్ అంకాలజీ, జనరల్ ఫిజీషియన్ వైద్యులు సేవలు అందిస్తారని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తారని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వెంకటాద్రిపై విశేషంగా పూజలు

పెందుర్తి : వెంకటాద్రిపై శనివారం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల సేవ నిర్వహించారు. సహస్రనామార్చన, అష్టోత్తరం పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ సేవల్లో పాల్గొన్నారు.

సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు సందర్శన

పరవాడ: పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టును (ఈఆర్–11, ఎస్ఆర్) సింహాద్రి అరిందం సిన్హా సందర్శించారు. శుక్ర, శనివారాల్లో రెండు రోజుల పాటు సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టులో సింహాద్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మతో కలిసి వివిధవిభాగాలను సందర్శించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్లాంటులో నియంత్రణ గది, మొక్కల ప్రాంగణంతో సహా కీలక ప్రాంతాలను పరిశీలించారు. అక్కడ కొనసాగుతున్న కార్యకలాపాలు, మెరుగుదలను అంచనా వేశారు. సింహాద్రి ఎన్టీపీసీలో కార్యాచరణ శ్రేష్ఠత నిరంతర మెరుగుదలకు ప్రాముఖ్యత కల్పించాలని అధికారులకు సూచించారు. ఉత్పాదక అంశాలపై ఉన్నతాధికారులతో చర్చించారు. సమీక్షలో ఎన్టీపీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గోశాల లే అవుట్‌లో మరో చోరీ



దొంగతనం ఎలా జరిగిందో నర్సింహమూర్తి, అతని భార్య సత్యవతిని అడిగి తెలుసుకుంటున్న క్రైమ్ పోలీసులు



బీరువా పరిశీలిస్తున్న క్రైమ్ ఏఎస్ఐ గోవిందమ్మ

సింహాచలం : అడవివరంలోని గోశాల లే అవుట్‌లో శనివారం మరో చోరీ వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. గోశాల లే అవుట్‌లో సింహాచలం దేవస్థానం రిటైర్డ్ ఉద్యోగి కోరుకొండ నర్సింహమూర్తి భార్య సత్యవతితో కలిసి సొంతింటిలోని పై పోర్షన్‌లో నివసిస్తున్నారు. క్రింది పోర్షన్‌ని అద్దెకు ఇచ్చారు. కాగా నర్సింహమూర్తి, సత్యవతి ఈనెల 10 నుంచి 13 వరకు వేర్వేరుగా ఇతర ఊళ్లకి వెళ్లి వచ్చారు. కాగా శనివారం ఉదయం బెడ్‌రూమ్‌లోని బీరువా కింద చీపురుతో శుభ్రం చేస్తుండగా వెండి వస్తువులు బయటకి వచ్చాయి. దీంతో బీరువా, లోపల ఉన్న లాకర్ తాళం తెరచి చూశారు. అందులో ఉన్న సుమారు 5 తులాల బంగారు వస్తువులు కనిపించలేదు. దీంతో గోపాలపట్నం క్రైమ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న క్రైమ్ ఎస్ఐ తేజేశ్వరరావు ఆధ్వర్యంలో ఏఎస్ఐ గోవిందమ్మ, హెచ్‌సీ గణేష్ పరిశీలించారు. మొత్తం 2 తులాల బంగారు గొలుసు, మరో రెండున్నర తులాల బంగారం చైను, పావుతులం చెవిదుద్దులు కనిపించడం లేదని బాధితులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా గోశాల లేఅవుట్‌లో నర్సింహమూర్తి ఇంటి ఎదురుగానే ఉన్న బంటుబిల్లి మహేష్ ఇంటిలో కూడా గడిచిన గురువారం సాయంత్రం చోరీ జరిగింది. బీరువాలో ఉన్న సుమారు ఐదు తులాల బంగారం, రూ. 90 వేల నగదు, 10 తులాల వెండి చోరీ జరిగింది. వరస దొంగతనాలతో గోశాల లేఅవుట్ వాసులు భయభ్రాంతులు చెందుతున్నారు.